అన్వేషణ ముగిసింది

"ఏమిటో అంత దీర్ఘంగా చదివేస్తున్నావు!..." అప్పుడే క్రికెట్ ఆట ముగించుకొని, హాస్టలుగదిలో అడుగుపెడుతూ విజయకుమార్ ప్రశ్నించాడు.

"ఏంలేదు . . . వరంగల్‌నుంచి ఉత్తరంవచ్చింది. ఏం తోచక తిరగేస్తున్నాను. ఉత్తరంలోంచి తలయెత్తి, దరహాసంతో జవాబిచ్చాడు రవి.

"వరంగల్‌నుంచా, ఎవరు వ్రాశారేమిటి?"

"అక్క వ్రాసిందిరా! ఎన్నిసార్లు చెప్పినా వరంగల్ రావేమిటి-అని మా అక్కకు కోపం . . . మనకేమో టైమ్ దొరకదాయె . . . ఏం చేద్దాం"

"బలేవాడివిరా! అంత ఆప్యాయతతో పిల్చే అక్కను చూడ్డానికి టైములేదా? అంత చేటు తీరికలేదా నాయనా నీకు? ఊఁ చెప్పు ఎప్పుడు బయల్దేరడం?

బాగుందిరోయ్! అక్కయితే సంక్రాంతి సెలవులదాకా టైమిచ్చింది నీవేమో ఇప్పుడే రెక్కలుకట్టుకుని వాలమంటున్నావు... నీలాంటి వాడుం డాలిరా వకాల్తాకి!"

అమ్మా - అక్కా - ఇద్దరి ప్రేమ పంచుకొనే నువ్వు నిజంగా చాలా అదృష్టవంతుడవిరా!" అతని కంఠంలో ఆవేదన ధ్వనించింది.

"అదేమిట్రా! నీకో అక్క- చెల్లీ ఎవరూలేరా — "ఆశ్చర్యంగా ప్రశ్నించాడు రవి.

"ఉహుఁ— మానాన్నకి నేనొక్కణ్నే కొడుకుని—అమ్మలేదు— ఇంకెవరూ లేరు — " బట్టలు మార్చుకోటం పూర్తిఅయి బరువుగా కూర్చుంటూ అన్నాడు విజ్జీ.

"అయితే మరి మీ నాన్నగారు..."

"ఉన్నారు—ఊహ తెలియని చిన్నతనంలోనే మా అమ్మపోయింది. నాన్నే నన్ను పెంచాడు—మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు ... నా భవితవ్యం కోసం" —అతని కంఠం స్పందించింది.

రవి మనస్సు ఆర్ద్రమైపోయింది. తను చిన్నప్పటినుంచి అక్క, అమ్మల అనురాగంలోనూ, నాన్న ఆప్యాయతలోనూ పెరిగాడు. ఏలోటూ లేకుండా గారాబంగా! పాపం విజ్జికి ఇవి ఏవీ లేవన్నమాట! ఆ మమతల విలువేమిటో రవికి ఇప్పుడు అర్థమవసాగింది. దీర్ఘాలోచనలో మునిగి విజ్జివైపు సానుభూతితో చూస్తూ అన్నాడు. "సరే విజ్జీ! ఈసారి సంక్రాంతి సెలవులకి అక్కావాళ్ళవూరు వెళదాం... నువ్వుకూడా రావాలి..."

"నేనా? మధ్య నేనెందుకురా... చూద్దాంలే—" అన్నాడు విజ్జి పరధ్యానంగా "ఇంతకూ ఉత్తరంలో విశేషాలేమీ చెప్పావుకావు?... అభ్యంతరం లేకపోతే .."

"అభ్యంతరమేమిట్రా నీ మొహం...ఇదిగో చదువు' అంటూ జాబు చేతికందించాడు రవి.

"చిరంజీవి చిన్నారి తమ్ముడికి ఆశీస్సులు.

ఏరా రవీ! అక్కను మరచిపోయావా ఏం? బొత్తిగా ఉత్తరాలే మానేశావు. నువ్విలాచెయ్యడం నాకేమీ బాగాలేదు. మీ బావగారుకూడా ముద్దులమరిదిని చూడాలని ఒకటే గోల. అంత తీరికలేకుండా ఉన్నావా నాయనా!

వచ్చే సంక్రాంతికి నువ్వు ఇక్కడికి రావాల్సిందే. అమ్మకుకూడా ఉత్తరం రాసేశాను. తమ్ముడు ఇంటికిరాడనీ, సెలవులంతా మాదగ్గరే ఉంటాడనీ.

వస్తావుకదూ! నీకోసం ఎదురుచూస్తూంటాను మరి.

నిన్ననే నాన్నదగ్గర్నించి ఉత్తరం వచ్చింది. ఇంటిదగ్గర అమ్మా, నాన్న తమ్ముళ్ళూ చెల్లాయిలూ అంతా బాగున్నారు.

జామకాయలూ, సీతాఫలాలూ తగ్గించావా లేదా? అంత పిచ్చిఇష్టం ఏవిట్రా నీకు? ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవద్దూ? అమ్మకూడా ఈ సంగతే వ్రాసింది.

మర్చిపోయాను, మీ హాస్టలు తెరిచారా ఇంకా హోటలుభోజనమేనా? నీ రూమ్మేట్ని గూర్చి చాలా వ్రాశావు. మనిషికి మంచి స్నేహితుడుండాలి అండగా. మనసుకు తగిన మమత ఉండాలి నిండుగా. సంతోషం.

ఇంకెన్నో సంగతులున్నాయి. వ్రాయటం ఎందుకూ? నువ్వే వస్తున్నావుగదా!

మనసారా దీవిస్తూ.

నీ అక్క—
మంజీర.

ఆ లేఖలోని అనురాగం, ఆప్యాయత చనువు, విజ్జీ మనసులో వెన్నెలలు నింపాయి. చదివినంతసేపూ ఏదో తెలియని ఆనందానుభూతిలో ఓలలాడిపోయాడు.

"మీ ఊరు తప్పకుండా వస్తాను రవీ!.. అక్కను చూడాలని ఉంది..." హఠాత్తుగా అన్నాడు విజయ్.

రవి ముఖం ఒక్కసారి వికసించింది "పోదామా! వెరీగుడ్!... నువ్వెంత మంచివాడవురా విజ్జీ. అయితే ఈసారి సెలవులు వరంగల్‌లో గడిపేద్దాం ఇవ్వాళెంతరా తారీకు?..." ఇద్దరిదృష్టులు కేలెండరువైపు పరుగెత్తాయి.

ం ం ం ం

రవి విజ్జీ కొత్తస్నేహితులు. ఇద్దరూ ఈ యేడే హైదరాబాదులో బి.ఎస్.సి.లో చేరారు. మొదటిసారి హోటల్లో కలుసుకున్నారు. ఓమూల భోంచేస్తున్న రవినిచూసి విజ్జికి ఎందుకో సానుభూతి కలిగింది. ఎవరో పాపం. తనలాగా హోటల్ భోజనం అలవాటులేదల్లేఉంది అనుకున్నాడు. ఆ తరువాత అప్పుడప్పుడూ అదే భోజనశాలలో కలిసేవాళ్ళు. విజ్జీకి అతణ్ణి మాట్లాడించాలని ఉండేది. కాని ఎలా కల్పించుకుని మాట్లాడ్డం?

ఆరోజు ఆటమైదానంలో విజ్జీకి పార్కర్ పెన్ దొరికింది 'అయ్యో! ఎవరు పోగొట్టుకున్నారో పాపం. అనుకుంటూ వెంటనే తీసుకుపోయి గేమ్స్ డిపార్టుమెంట్‌లో అప్పగించాడు.

మర్నాడు క్లాసు కాగానే పెన్ పోగొట్టుకున్న విద్యార్థి అ హంతం విజ్జీదగ్గరికి వచ్చి "చాలా థాంక్సండీ! మా అక్క ఆప్యాయంగా నా పుట్టినరోజునాడు ఇచ్చిన పెన్ను ఇది .. ఇంతకూ ... గేమ్స్ మాష్టారు చెప్పారు మీ పేరేకదూ విజయకుమార్?" అంటూ చెయ్యి కలిపేశాడు హాయిగా నవ్వుతూ.

"మీరా?..." ఆశ్చర్యంగా చూస్తూ ఆనందం పెనవేసుకున్నట్లుగా అన్నాడు విజ్జీ. మళ్ళీతేరుకొని అన్నాడు. 'ఫరవాలేదండీ, అంత విలువైన పెన్ను మళ్ళీ మీకు దొరకటం చాలా సంతోషంగా ఉంది ... మిమ్మల్ని హాటల్లో చూస్తుంటాను. మీ పేరు?..."

నాపేరు రవి...వి.బి. రవి... పూర్తిగాచెప్పాలంటే వేదం భారవి."

"బలే చమత్కారమే... భారవి పేరు, అంతగా భారం కాదుగాని రవిమాత్రం రమ్యమైన పేరండి..." నవ్వుతూఅన్నాడు విజ్జీ. . "ఇంతకూ మీకు నా పెన్ను దొరికింది."

"పెన్నులాగా ఈ స్నేహంమాత్రం పోగొట్టుకోనులెండి."

ఈ సంభాషణే వాళ్ళిద్దరినీ విడిపోని సన్నిహితులుగా కలిపింది. ఒకరొకరిని 'మీరు' - 'అండి' . . . అంటూ లాంఛన ప్రయోగాలతో మాట్లాడుకోటం కూడ అదే తొలిసారి; తుదిసారికూడా అయింది.

o o o

ఆరోజున సెలవేమో, విజయ్ కిటికీదగ్గర కూర్చొని ఏదో చిత్రానికి రంగులు వేస్తున్నాడు. బయటనుంచి అప్పుడే వచ్చిన రవి చూపు ఆకస్మికంగా ఆచిత్రంపై ప్రసరించింది. ఆశ్చర్యపడుతూ అన్నాడు. "అరె! ఎంత బావుంది. 'చావానె ప్రహూ'.. ఇదంతా నువ్వే వేశావా?"

తలయెత్తి నవ్వుతూఅన్నాడు విజ్జి, "అవును రవీ! బాలల దినోత్సవ సందర్భంగా మన కాలేజీపోటీలకని తయారుచేస్తున్నాను, ఎలా వుంది?..."

"అద్భుతంగా ఉంది. నువ్వింత మంచి చిత్రకారుడవని నాకు ఇప్పటిదాకా తెలియదు. కవిత్వం ఒక్కటే నీ హాబీ అనుకున్నాను! ఈ మూడునెలల్నించీ ఎప్పుడూ నువ్వు చిత్రంగీయగా చూడలేదు ..''

"చిత్రకళ నాకెంతో ఇష్టంరా రవీ! నా రచనలు చాలా చిత్రాలు న్నాయి. చూస్తావా? నాకుకూడా తృప్తిగా ఉంటుంది నువ్వు చూస్తే...''

"ఓయెస్! ఏవీ తీసుకురా! ఈ పుస్తకాలతో బోర్ కొడుతుంది ఒక మంచి ఛేంజ్..'' కుతూహలంతో అన్నాడు రవి.

చిత్రాల ఆల్బమ్‌కు చెరోవేపు కూర్చున్నారు. అందాకా గంభీరంగా ఉన్న వాతావరణం ఇప్పుడు ప్రఫుల్లితమైంది.

"అబ్బ, ఎంత నైపుణ్యం..." ఒక్కొక్కచిత్రం చూస్తూ రవి ఆశ్చర్యచకితుడై పోతున్నాడు.

'ప్రకృతి కన్య'—''ఓహో! ఇన్ని సోయగాలతో ఇంత అందంగా ఉంటుదా ప్రకృతి" అనుకున్నాడు రవి.

'బడలిక,' 'బాధ్యత,' 'మాతృమూర్తి,' 'నిరీక్షణ,' 'పుష్ప విలాసం'- అందాలు చిందుతూ, కన్నుల విందుగా, మూగభావాలు ఒలక బోస్తూ ఒక్కొక్క చిత్రం ఆతనిలో వినూత్న ఉత్తేజం వెలార్చింది.

"ఇంత గొప్ప చిత్రకారుడు నా స్నేహితుడు కావడం అంటే- నా కెంతో గర్వంగా ఉందిరా!" మిత్రుని యెడఅభిమానం నిండిన స్వరంతో అన్నాడురవి, చూడటం ముగిస్తూ.

"సరేలే! నీ మాటల్లో నా గొప్పకంటే నీ అభిమానమే వినిపిస్తోంది రవీ! కాని నాకు క్రొత్త బలం వస్తోంది. ఇంతకూ ఇవన్నీ నీకూ నచ్చిన చిత్రాలు కదూ?... మరీ నాకు నచ్చిన చిత్రంచూస్తావా?...అది నా అభి మాన చిత్రం తెలుసా?—"

పట్టరాని ఉత్సాహంతో రవి అన్నాడు, "అలాగా; ఏదీ? అది ఈ ఆల్బంలో ఎందుకు చేర్చ లేదింకా?—"

విజయ్ తన సూట్‌కేసు తెరచి, ఒక కవర్లోంచి తీస్తూ ఆ చిత్రం తీసుకువచ్చాడు.

చిత్రం చూస్తూనే స్థబ్దుడైపోయాడురవి. "ఇదా? నువ్వెలాగీశావు? చిత్రాన్ని తేరిపార చూస్తూ, కొంచెం తమాయించుకొని మళ్ళీ అన్నాడు, "ఈమె... ఎవరీమె? . . .?"

"ఏమని చెప్పను? మామూలుగా చెప్పాలంటే ఈమె ఎవరో నాకు తెలియదు. కాని జన్మజన్మల చిరపరిచిత సంబంధం ఉన్నట్లనిపిస్తుంది

నా హృదయంకూడా ఇదే ప్రశ్నిస్తూ ఉంటుంది— ఎవరీమె?— యేమో నా ఆరాధ్య దేవత అనుకుంటాను—"

రవి కేమీ అర్థంకాలేదు. ఆ చిత్రం పైన ఉన్న 'మమత' అనే అక్షరాలు చదువుతున్నై అతని పెదవులు నిశ్శబ్దంగా.

విజ్జి చెప్పుకుంటూ పోతున్నాడు, "ఎందుకు చిత్రించానో తెలియకుండానే, ఎవరో తెలియకుండానే, చిత్రిస్తూ పోయాను. నెలల కొద్ది మెరుగులు దిద్దాను, ఇంకా దిద్దుతూనే ఉన్నాను. ఎదలో నింపిన మమతల్ని చిరకాలం నేను కోరిన మమతల్ని అన్నింటినీ కలబోసి రూపుదిద్దాలని నే చేసినయత్నం ఇది. అప్పుడప్పుడు నా కనిపిస్తుంది - అక్క, అమ్మల అనురాగం ఎరుగని నా హృదయంలో శూన్యాన్ని ఈ రూపంలో నింపుకుంటున్నానా, అని. మా అమ్మ ఎలాఉండేదో — నాకు గుర్తులేదు—' యేదోలోకంలో 'ఉన్నట్లు చెప్పుకుపోతున్నాడు. హఠాత్తుగా ఆగిపోయాడు

మధ్యలోనే ప్రశ్నించాడురవి. "ఒకవేళ ఈమె నీకీ లోకంలో కనిపిస్తే!—"

విజ్జి ముఖంలో ఉత్తేజం తాండవించింది. 'అవును రవీ! ... తప్పకుండా ఎవరో వ్యక్తి... ఇలాంటి వ్యక్తి ఈ లోకంలో ఉండాలి. ఉం. తీరాలి. నువ్వు నమ్ముతావు కదూ?"

"ఈమె నీకు కనిపిస్తే ఏంచేస్తావు?"

'ఇన్ని ఏళ్ళ నిరీక్షణ, నా అన్వేషణ సఫలం చేసిన ఈ స్త్రీమూర్తికి మనసారా నమస్కరిస్తాను. ఆమె ఒడిలో పడుకొని తృప్తిగా కన్నులు

చూస్తాను— నా హృదయంలో అంతులేక కొనసాగే శూన్యానికి ఆఘడియ ఎప్పుడా అని ఆవేదన పడుతున్నాను, రవీ'—యేదో చెప్పుకుపోతున్నాను. పిచ్చి వాడననుకుంటున్నావా?...."

నేనలా అనుకోను—సరేకాని, ఒకవేళ ఈమె నీకు తటస్థ పడితే, నీవు ఊహించినంత అమృత మూర్తి కాకపోతే—"

'నా ఊహల మీద నాకు నమ్మకం ఉంది రవీ!" దృఢంగా ఉంద తని స్వరం.

'ఒకవేళ ఇలాంటి స్త్రీని నీకు నేను చూపిస్తాననుకో-నాకేమిస్తావ్?'

'నిజంగానా ఇలాంటి వ్యక్తిని నీవెక్కడైనా చూశావా? లేక వేళా కోళం చేస్తున్నావా రవీ!' విస్ఫారిత నేత్రాలతో, ఆత్రంగా అన్నాడు విజయ్.

'లేదు విజయ్... త్వరలోనే నీకీమె కనిస్తుందని నాకెందుకో అని పిస్తున్నది.'

ఆరోజంతా కులాసాగా గడిచి పోయింది. నవనీతం కన్నా కోమలమై, మమతాపూర్ణమై కూడా మమత కోసం ఆవేదన పడే విజ్జి ప్రవృత్తికి రవి ఆశ్చర్య పడసాగాడు. యే స్త్రీ అనురాగం ఎరుగని ఈతని మమతాశూన్య హృదయం ఎంతో కఠోరంగా మారిపోవలసింది. పెడదారులు పట్టలేదు. కవిగా, చిత్రకారుడుగా, భావుకుడు కావడమే, అందుకు కారణమై ఉండాలి. ఈ దారుల్లో ఆతని హృదయం మగ్నమై ఆర్ధ్రిమైఉండకపోతే... యేదో ఆలోచిస్తూ, టేబుల్‌లైట్ ముందు కూర్చొని లెటర్ ప్యాడ్ తెరిచాడు రవి. సంక్రాంతి సెలవుల్లో స్నేహితునితో సహా వరంగల్ వస్తున్నట్లు ఉత్తరం వ్రాసేశాడు.

తెలుగునాట, ఇంటింటా వింత కాంతి వెలయిస్తూ, సంక్రాంతి సమీపిస్తోంది. ఉత్సాహంతో ఉరుకులు తీసే రైలుపెట్టెలో కాలమంతా సల్లాపంలో గడిచిపోయింది, స్నేహితులిద్దరికీ· 'అక్కను చూసి చాలా కాలమైంది. ఇంకా వరంగల్ రాదేమా' అనిపిస్తోంది రవికి. కమ్మని కబుర్లలో ప్రకృతి దర్శనంలో వరంగల్ స్టేషన్ ఇట్టే వచ్చేసింది. ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు.

దారిలో విజ్జి అన్నాడు, "నేను నెల్లూరి వాడను. వరంగల్ మొదటిసారి వస్తున్నాను. నెల్లూరుకీ, వరంగల్‌కూ చుట్టరికం కలిపిన మహానుభావుడు, తిక్కన సోమయాజి గుర్తుకువస్తున్నాడు రవీ!..."

"అవును విజ్జీ! తెలుగు వాళ్ళ చరిత్రలో అదొక మధురఘట్టం. ఒక అద్భుతసన్నివేశం..."

కొంతసేపు మౌనంగా పయనించారు. ఇల్లు దగ్గరకు వస్తోంది. రవి ప్రస్తావించాడు. "అనుకోకుండా ఒక అద్భుతసన్నివేశం ఎదురైతే ఆ అనుభూతి ఎలా వుంటుంది విజ్జీ—"

"భాషాశక్తికి అతీతంగా ఉంటుందనుకుంటాను. అయినా నాకలాంటి అనుభూతి ఎదురుపడలేదెప్పుడూ!—"

సంధ్యా సమయం. చిరు చలిగా పిల్లగాలి వీస్తోంది. విశాలమైన వరంగల్ రాజమార్గం మీద రిక్షా పరుగెత్తుతోంది. కాకతీయ కళాప్రాభవ నిలయంగా, ప్రాచీనాంధ్ర నగరంగా ఆ వినూత్న వాతావరణంలో విజయ్ మనస్సులో ఉత్సాహం ఉరకలు పెడుతోంది. ఆనందం వెల్లివిరుస్తోంది.

మరో పదినిమిషాల తరువాత ఒక ఇంటి ముందు నిల్చునిఉన్నారు,

ఇద్దరూ. తలుపుతట్టి "అక్కా" అని పిల్చాడు రవి.

ఒక నిమిషంలో జవాబు వచ్చింది చందమామలాంటి ముఖంమీద వెన్నెల్లాంటి చిరునవ్వుతో, అచ్చుపోసిన ఆప్యాయత లాంటి రూపంతో, తలుపు తీసింది అక్క, విజ్జిఉన్నచోటే దిగ్భ్రాంతుడై నిల్చుండిపోయాడు, ఆ మూర్తిని తిలకిస్తూ.

"ఈమె?...తన ఊహా చిత్రం!...కలా, నిజమా? తను చిత్రించుకున్న "మమత" ఎదురుగా సజీవంగా నిలబడి చిరునవ్వుతో ఆహ్వానిస్తుంటే కల ఎట్లా అవుతుంది?..."

"అలా నిలబడి పోయావేం విజ్జీ! పదలోపలికి. ఈమె మాఅక్క' విజయ్‌ని హెచ్చరిస్తూ; చిన్నగా నవ్వుకుని మంజీరవైపు చూశాడు రవి.

"మీ స్నేహితుడికి మొహమాటం ఎక్కువల్లే ఉందే.లోపలికి రా బాబూ!...నీ పేరు విజయ్ కదూ?...నువ్వు కూడా తమ్ముడివే," ఆమె కంఠం నుంచివెలువడ్తున్న ప్రతి పలుకూ తేనె సోనలా వుంది విజయ్‌కి. ఏదో స్వప్న లోకంలోలా మౌనంగా లోపలికి నడిచాడతను.

మంజీర భర్త ఆనంద్ చాలా ఆదరంతో, అభిమానంతో పలకరించాడు విజ్జిని కూడా...ఎంతో పరిచితుడులాగే ఆ యిద్దరి ఆప్యాయతలో కరిగి పోయాడు విజయ్.

"మీ యిద్దరి ఆదరానికీ చాలా కృతజ్ఞతలండీ" అన్నాడు, మాటలు వెతుక్కుంటూ విజయ్.ఆమె నవ్వింది' కోయిలలు కూసినట్లు, మల్లెలు వికసించినట్లు అనిపించింది విజయ్‌కి, "అం[illegible],.గిండీ ఏమిటి బాబూ! చెప్పాను గదా! నాకు.నువ్వూ రవీ ఒకటే. నీకూ నేను అక్కనే..."

"కాదమ్మా!...అమ్మవు..." అనుకున్నాడు పెదవులతో విజ్జీ.

"ఇంతకీ తమ్ముడూ! నువ్వేసిన చిత్రమేది? నాకు చూపించవూ?" అంది మంజీర, పొంగివచ్చే అనురాగంతో.

తను సృష్టించిన ఆ మూగ మమత చిత్రం చేతిలో పట్టుకొని, నజీవంగా కూర్చున్న మమతా మూర్తినిచూస్తూ, తన నిరంతర అన్వేషణ ముగిసిన సంతృప్తితో. ఉద్విగ్నుడైనాడు విజయ్.

చిత్రం చూడడంలో మునిగిపోయింది మంజీర. విజ్జి మనస్సు ఎక్కడో తిరుగుతోంది. 'నన్ను అంత చిన్న పాపగా ఎందుకు వదలి పెట్టి పోయావమ్మా!... మళ్ళీ ఇన్నాళ్ళకా నీదర్శనం— నేనేం చేశాను?' అంటున్నదతని మనస్సు. మాటల రూపంలో ఆ భావం బహిర్గతంకాలేదు. కానట్లు అతనికి తెలియదు.

"ఏమిటి బాబూ! అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అతని మొహంలోకి చూస్తూ, ఉలిక్కి పడింది మంజీర. "అరె! ఎందుకు కన్నీరు పెడుతున్నావు?"

"కన్నీరు కాదక్కా! పన్నీరే! అనుకోని అదృష్టం రవి రూపంలో నన్ను వెతుక్కుంటూవచ్చి, సంవత్సరాల నా అన్వేషణ ఫలింపచేసి, చల్లని నీ సన్నిధిలోకి చేర్చింది...."

మంజీర హృదయం అనురాగంతో పొంగింది. "బాబూ! ఈ జన్మలో మనది రక్తసంబంధం కాకపోవచ్చు. కానీ ఆప్యాయతలు జన్మ సిద్ధమే కావుకదా!" విజయ్‌ని దగ్గరకు తీసుకొని తలనిమురుతూ అంది.

రెండు వెచ్చని బాష్పబిందువులు ఆమె పాదాలపై పడ్డాయి. ఆమె ఆశీర్వ దిస్తూ అంది, "పదికాలాలు పచ్చపచ్చగా వర్ధిల్లాలి విజ్జీ!"

బాగా ప్రొద్దెక్కింది. "అమ్మ ఒడి చదువులబడి. మా అమ్మవొడి నాకొక గుడి," కూనిరాగం తీస్తూ స్నానం ముగించుకొని వస్తున్నాడు విజయ్.

"ఏరా విజయ్... మా అక్కనుచూసి నన్ను మర్చిపోయినావు కదూ!..." అంటూ వంటింట్లోకి దారితీశాడు రవి.

"నిన్నెలా మర్చిపోతాన్రా. నీవే లేకపోతే అంతా చీకటే రవివి కదూ!"

"మంజూ! ఇక వడ్డించెయ్, నీ తమ్ముళ్ళిద్దరూ వచ్చేశారు .." అన్నాడు ఆనంద్ అప్పుడే ఇంట్లో అడుగుపెడుతూ. అంతా భోజనాల దగ్గర కూర్చున్నారు. అక్క చేసిన మిఠాయిలు తింటూ రవి అన్నాడు, "విజ్జీ ఈ అనుభూతి ఎలావుందిరా?..."

దీనికి సమాధానం నీకిదివరకే చెప్పినట్లు జ్ఞాపకం .. ఈ అనుభూతి ఈ అనుభూతిలాగే ఉంది''.

పండుగ మూడురోజులు మూడు క్షణాల్లా గడిచిపోయినై. సెలవుల అనంతరం బాధాకరమైన వీడ్కోలుదినం వచ్చింది. అనుబంధాలెంత విచిత్రమైనవి? అనుకున్నారు అందరూ.

○ ○ ○ ○

అది మార్చినెల పట్టణంలో కలరా వ్యాపించడంవలన ఓ వారం రోజులు కాలేజీ మూసేశారు. విజయ్ తండ్రిని చూడాలని ఇంటికివెళ్ళాడు

రవికూడా తనవూరు బయలుదేరి వెళ్ళాడు. ఎలాగో వారంరోజులు గడిచి పోయినై.

రవి అప్పుడే బండిదిగి టైమవుతోందని సరాసరి కాలేజీకే వెళ్ళాడు క్లాసులోచూస్తే విజయ్ లేడు 'ఇంకా ఊరినుండి రాలేదేమో' అనుకుంటూ రీడింగ్‌రూమ్‌కి నడిచాడు రవి. అక్కడ బల్లమీద తనపేరున రెండు త్తరాలు ఎదురుచూస్తూ కనపడినై. ఒక ఉత్తరంమీద నెల్లూరు ముద్రఉంది.

''ఓహో! విజయ్‌దగ్గర్నుంచా'' అనుకుంటూ కవరు ఆత్రంగా చించాడు రవి. అది చదువుతూనే కుప్పకూలిపోయాడు. 'కలరా వచ్చి విజయ్ చనిపోయాడని' అతని తండ్రి వ్రాసిన ఉత్తరమది. క్షణంసేపు స్తంభించిపోయి దుఃఖ మాపుకోలేక బయటకి వచ్చేశాడు రవి. అతని పాదాలు హాస్టలు గదివైపు నడుస్తున్నాయి దారిలో రెండవ ఉత్తరం చింపి చూశాడు. వరంగల్ నుంచి బావ వ్రాసిన లేఖ: అక్క ప్రసవించిందనీ, బాబు పుట్టాడనీ వ్రాసివుంది.

హాస్టల్‌గది తాళం తెరవాలంటే బాధ. భయం ఆవరించాయి. గదంతా ఏదో వేదనతో శూన్యంగా కనిపిస్తోంది. హఠాత్తుగా అతని దృష్టి క్రిందపడిఉన్న మరో ఉత్తరం మీద పడింది. అరె! విజయ్ వ్రాత — విజయ్ బ్రతికే ఉన్నాడా?" ఉత్తరం చేతిలోకి తీసుకున్నాడు. నాలుగు రోజుల క్రింద వ్రాసిన లేఖ అది.

బావ ప్రక్కన కూర్చొని రవి, విజయ్ భోజనం చేస్తుంటే' అన్నం వడ్డిస్తున్న 'మమత' చిత్రం— దానితో పాటు ఒక లేఖ ఉన్నై కవర్లో.

సజల నేత్రాలతో సూట్‌కేస్ సర్దుకుని గదికి తాళంవేసి, గబగబా స్టేషన్ వైపు బయల్దేరాడు రవి. రైలు వరంగల్ వైపు ఉరకలు పెడ్తోంది. మళ్ళీ ఉత్తరాలు తీసి చూశాడు. అతని హృదయంలో అద్భుతం ఆవరించింది. ఆ రెండుసంఘటనలు ఒక రోజే జరిగాయి. ''విజయి చనిపోలేదు; మళ్ళీ పుట్టాడు, అతని అన్వేషణ ముగిసింది,'' కాగితాలు మడత పెట్టేస్తూంటే, అప్రయత్నంగా అతని నోటి నుండి ఈ మాటలు వెలువడినై. కంటి నుండి రెండు జలబిందువులు రాలినై.

(యువ మాసపత్రిక 1972)

కథా నిలయం
1482
శ్రీకాకుళం